క్లుప్తంగా

అభాగ్యులకు భోజనాల పంపిణీ



భిక్షాటన చేసుకున్న వారికి భోజనం ప్యాకెట్ ఇస్తున్న సంతోష్

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రాంతానికి చెందిన సామాజిక సేవా కార్యకర్త కాకి సంతోష్ పారిశ్రామిక ప్రాంతంలో పలువురు నిరుపేదలు,భిక్షాటన చేసుకున్న వారికి శనివారం మధ్యాహ్నం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. మల్కాపురం, శ్రీహరిపురం తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు, బస్టాప్‌ల వద్ద సేద తీరుతున్న వారి వద్దకు వెళ్లి ఈ భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా మిత్రుల సాయంతో నెలలో ఒక రోజు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు.

స్టీల్‌ప్లాంట్ ట్రైనింగ్ క్యాలెండర్ ఆవిష్కరణ



ట్రైనింగ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఎండీ అతుల్‌భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ 2023–24 ట్రైనింగ్ క్యాలెండర్‌ను శనివారం ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలో సీఎండీ అతుల్‌భట్ ఆవిష్కరించారు. స్కిల్ డెవలప్‌మెంట్, టెక్నాలజీ, కంప్యూటర్, భద్రత, ఆరోగ్యం తదితర అంశాలపై ఉద్యోగులకు ఇవ్వనున్న కార్యక్రమాలతో కూడిన వివరాలతో క్యాలెండర్‌ను రూపొందించారు. క్యాలెండర్‌ను రూపొందించిన ట్రైనింగ్ కమిటీని అభినందించారు. కార్యక్రమంలో సీజీఎం జి. గాంధీ, ట్రైనింగ్ విభాగాధిపతి ఎన్. భాను తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నీటి దినోత్సవం



నీటి పొదుపు పాటించిన అధికారులకు షీల్డులందజేస్తున్న సీజీఎం మహంతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు శనివారంతో ముగిశాయి. 23 నుంచి 25 వరకు మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన వేడుకల్లో వివిధ పోటీలు నిర్వహించారు. శనివారం ఈడీ (వర్క్స్) కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన ముగింపు వేడుకల్లో సీజీఎం (వర్క్స్) బి.కె. మహంతి ముఖ్య అతిథిగా హాజరై నీటి పొదుపు పాటించిన విభాగాలకు షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఏయూ ప్రొఫెసర్ డాక్టర్ వి. శ్రీదేవి, కెమ్ బాండ్ ప్రతినిధి అనూప్ రంజన్ నీటి నిర్వహణ విధానాల గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనుకు సన్మానం



శ్రీనును సన్మానిస్తున్న నాయకులు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారువద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో 92వ వార్డు శానిటరీ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ దమ్ము శ్రీను అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తారన్నారు. ఇలాంటి వ్యక్తిని సత్కరించడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు, దొడ్డి కిరణ్, నాయకులు అప్పలసప్వామి, మురళీ కృష్ణ, ఆర్‌పీలు, మహిళలు పాల్గొన్నారు.



జాతీయ రహదారిలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ

జీ-20కి ముస్తాబు

- సుందరంగా జాతీయ రహదారి
- చురుగ్గా సాగుతున్న అలంకరణ పనులు

గోపాలపట్నం: జీ–20 సదస్సుకు విశాఖ నగరం ప్రత్యేకంగా ముస్తాబువుతోంది. విశాఖ విమానాశ్రయం నుంచి నగరంలోకి వచ్చే దారులను అందంగా తయారు చేస్తున్నారు. విశాఖ విమానాశ్రయం వద్ద సాంప్రదాయ నృత్యభంగిమల్లో ఉన్న బొమ్మలకు రంగులు వేశారు. దీంతో ఇవి మరింత ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. జాతీయ రహదారిలో విద్యుత్ స్తంభాలను ఎల్‌ఈడీ దీపాల బెల్టులతో అలంకరించారు. చిన్నచిన్న మిగులు పనులను సైతం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నారు. ఇక్కడి మర్రిపాలెం వుడాలేఅవుట్‌కు వెళ్లే దారిని అందంగా తీర్చిదిద్దారు. ఇక్కడి ట్రయాంగిల్ పార్క్‌లో వాటర్ ఫౌంటెయిన్‌కు మరమ్మతులు చేపట్టారు. సాయంత్రం వేళ విద్యుత్ లైట్లు వెలుగులు విరజిమ్ముతున్నాయి.



ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద అందంగా తీర్చిదిద్దిన మర్రిపాలెం వుడాలేఅవుట్‌కు వెళ్లే దారి



ఎయిర్‌పోర్టు జంక్షన్ వద్ద నూతన శోభను సంతరించుకున్న నర్తకి రూపం



ఎన్‌ఏడీ జంక్షన్‌లో రంగులు వేస్తున్న కూలీలు

ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి షిప్‌యార్డ్ న్యూకాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఫేర్‌వెల్ డేలో విద్యార్థులు ఆడి పాడారు. పాఠశాలలోని 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు పరీక్షల మీద శ్రద్ధ పెట్టి నూరు శాతం మార్కులు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు నాంది పలుకుతూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, వసతి దీవెన, నాడు–నేడు వంటి సంస్కరణలతో పాఠశాల అభివృద్ధితో పాటు విద్యార్థులను ఆర్థికంగా ఆదుకుంటున్నారన్నారు. అనంతరం ఉపాధ్యాయులు కార్పొరేటర్ నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

రెండు కంటైనర్లు ఢీ

డ్రైవర్ మృతి

మల్కాపురం: ఒకే మార్గంలో వెళ్తున్న రెండు కంటైనర్లు ఒకదానికొకటి ఢీ కొట్టడంతో వెనుక ఉన్న కంటైనర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం అర్ధరాత్రి (శనివారం తెల్లవారి) 2 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదంపై మల్కాపురం సీఐ లూథర్‌బాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బహదూర్‌యాదవ్ కంటైనర్‌తో శ్రావణి షిప్పింగ్ నుంచి లోడ్‌తో శుక్రవారం రాత్రి షీలానగర్ మార్గం నుంచి మారుతీ సర్కిల్ రోడ్డు మీదెగా కాన్వెంట్ వంతెన వైపు వెళ్తున్నాడు.అదే సమయంలో ఈ కంటైనర్‌కు వెనుక బిహార్ రాష్ట్రానికి చెందిన శంభుసింగ్ స్థానికంగా గల గేట్ వేకు వెళుతున్నాడు. ఈ రెండు కంటైనర్లు ఐఎన్ఎస్ డేగా నుంచి హెచ్‌పీసీఎల్ పెట్రోపార్కు సమీపానికి వస్తున్న సమయంలో శంభుసింగ్ తన వాహనంతో బహదూర్‌యాదవ్ వాహనాన్ని వెనుక బలంగా ఢీ కొట్టాడు.ఈ ఘటనలో లారీ ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతో శంభుసింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మల్కాపురం పోలీసులు వివరాలను సేకరించి, బహదూర్‌యాదవ్‌ను అదుపులోకి తీసుకున్నారు. సీఐ లూథర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు.



ఘటన స్థలంలో మృతి చెందిన డ్రైవర్

ఎన్‌ఎంఎంఎస్‌లో విద్యార్థుల ప్రతిభ



గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు స్వీట్లు తినిపిస్తున్న హెచ్‌ఎం హెప్సిబా



గోపాలపట్నం బాలుర పాఠశాలలో విద్యార్థుల్ని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గోపాలపట్నం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో గోపాలపట్నం పరిధిలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 10 మంది విద్యార్థులు ఈ పరీక్షల్లో ఎంపికై ఉపకార వేతం అందుకునేందుకు అర్హత సాధించారు. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఈ ఉపకార వేతనం అందుకుంటారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పామర్తి లక్ష్మి కారుణ్య, భవిరి జ్ఞాన ప్రకాష్, పంగ హర్షవర్ధన్ నాయుడు, మోపర్తి ఫిలెమోన్ ప్రేమ్ ప్రకాష్ ఎంపికయ్యారు. అలాగే బాలికోన్నత పాఠశాల నుంచి యల్లపు సంతోష్ లక్ష్మి, వంగపండు గీతిక, సీహెచ్ సాయి సంయుక్త శ్రీ, ఎల్లపువానిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి డి. మంజూష, డి, మనీష, కె. దీపిక ఎంపికయ్యారు. ఆయా పాఠశాలలో శనివారం విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ఏఎంసీ స్నాతకోత్సవం

మహారాణిపేట : ఆంధ్రా మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవం, ఎంబీబీఎస్ 96వ స్నాతకోత్సవం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం ఘనంగా జరిగాయి. 2017 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు, అధ్యాపకులకు ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు స్వాగతం పలికారు. రిటైర్డు డీఎంఈ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్. శశిప్రభ, ఏఎంసీ మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ సుధాకర్ గౌరవ అతిథులుగా విచ్చేసి వైద్య వృత్తి ప్రాముఖ్యతపై ప్రసంగించారు. ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు ముఖ్య అతిథిగా హాజరై స్నాతకోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన 2017 ఎంబీబీఎస్ బ్యాచ్‌ను అభినందించారు. వైద్యులు మానవతా దృక్పథంతో రోగులకు సేవ చేయాలన్నారు. వైద్య విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. డాక్టర్ జి. రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ (అడ్మిన్) కొత్తగా ఉత్తీర్ణులైన మెడికల్ గ్రాడ్యుయేట్లతో ప్రమాణం చేయించారు. 2017 బ్యాచ్‌కు చెందిన ఇద్దరు ఉత్తమ విద్యార్థులు డాక్టర్ శ్యామా మదిన్య, డాక్టర్ డి.వైష్ణవి ప్రియాంక అధ్యాపకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ 2017 బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిర్మిస్తున్న సెంటినరీ అకడమిక్ బ్లాక్ నిర్మాణానికి రూ. 2 లక్షల చెక్కును అందజేశారు.



స్నాతకోత్సవంలో పాల్గొన్న న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు తదితరులు

దళిత యువతి కుటుంబానికి న్యాయం చేయాలి

కంచరపాలెం: పెళ్లి చేసుకుంటానని నమ్మించి దళిత యువతిపై లైగింక దాడికి పాల్పడి కిరాతకంగా హతమార్చిన జాఫర్ వలిని ఉరి తీయాలని దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు డిమాండ్ చేశారు. ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు, నగర మహిళ కన్వీనర్ గొల్లమాల మీనా నేతృత్వంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం బొందలవాడకు చెందిన దళిత యువతిపై వివాహితుడైన ఆటో డ్రైవర్ జాఫర్ వలి ఈ ఘాతుకానికి పాల్పడటం దురదృష్టకరమన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించి బాధిత కుటుంబానికి ఆర్థికంగా న్యాయం చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో దళిత సేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న పారిశ్రామికవేత్త పాండురంగప్రసాద్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో ముగ్గురు అమ్మవార్ల ఆలయాల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. శ్రీ కుంచాలమ్మ, శ్రీ దుర్గాలమ్మ, శ్రీ ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాలకు పలువురు వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు, గ్రామస్తులు భారీగా విరాళాలు అందజేస్తున్నారు. శనివారం అమ్మవార్ల ఆలయ నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డికి పారిశ్రామికవేత్త సజ్జా పాండురంగప్రసాద్, యోజన దీపిక దంపతులు రూ.1,00,116 విరాళంగా అందజేశారు. విరాళ దాతకు ఆలయ కమిటీ ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

గోపాలపట్నం: రైలు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన వెంకటాపురం వద్ద శనివారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 92 వార్డు వెంకటాపురం గ్రామానికి చెందిన శీరపు సన్యాసిరావు(57) కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం 6 గంటల సమయంలో గ్రామ శివారు రైల్వే ఐదు మదాల సమీపంలో రైలు పట్టాలపై విగత జీవిగా పడి ఉన్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని స్థానికులు చెబుతున్నారు. అనారోగ్య సమస్యతో, బహిర్భూమికి వచ్చినపుడు ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డా అని అనుమానిస్తున్నారు. మృతునికి భార్య ఇద్దరు కొడుకులు ఉన్నారు. విజయనగరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి మృత దేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

2న పైడితల్లమ్మ పండగ



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు ప్రశాంతినగర్ పైడితల్లమ్మ ఆలయంలో అమ్మవారి ఉత్సవ తేదీలు ఖరారు చేయడానికి శనివారం కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ అమ్మవారి పండగను వైభవంగా నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 30న ఘటాల సంబరాలు, ఏప్రిల్ 1న తొలేళ్లు, 2న అమ్మవారి ప్రధాన పండగ జరుగుతుందని తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో బుద్ద శివాజీ, గొర్లె కృష్ణ మూర్తి, చందన గాంధీ, జి. పెదబాబు, నారిపిల్లి సత్తిరాజు, మళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క కార్టూన్‌తో అనేక భావాలు



కార్టూన్ వాచ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి తదితరులు

అల్లిపురం: ఒక్క కార్టూన్‌తో నవరసాలు పలికించవచ్చని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. హాస్యం, వినోదం, రాజకీయం.. ఇలా ఏదైనా కార్టూన్ ద్వారా తెలియజేయవచ్చన్నారు. మేఘాలయా హోటల్లో శనివారం జరిగిన కార్టూన్స్ వాచ్ కార్టూన్స్ ఫెస్టివల్–2023ను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా కార్టూన్ వాచ్ పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్టూన్ వాచ్ ఫెస్టివల్‌ను విశాఖలో నిర్వహించినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా కార్టూన్ వాచ్ కుటుంబం ఎడిటర్ త్రయంబకశర్మను గౌరవించుకోవడం ముదావహం అన్నారు. ఛత్తీస్‌గఢ్ టూరిజం ఎండీ అనిల్ సాహు, డీవీఆర్ మూర్తి మాట్లాడుతూ కార్టూన్లు ఎన్నో భావాలను తెలియజేస్తాయన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు కార్టూనిస్టులను సత్కరించారు. కార్టూనిస్టులు ఎం.శంకర్‌రావు, టి.వెంకటరావు, శ్రీహరి వెంకట రమణలకు లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు.

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మహిళా పక్షపాతి అని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. వైఎస్సార్ ఆసరా సొమ్ము జమ చేసిన సందర్భంగా జీవీఎంసీ 89, 90, 91, 92 వార్డు పరిధిలోని ఆర్‌పీలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాట తప్పని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో యూసీడీ పీడీ పాపు నాయుడు, డీఎంసీ నాగరాజు, ఏపీడీ శ్రీరామ్, వార్డు అధ్యక్షులు గుణిశెట్టి శ్రీనివాసరావు దొడ్డి కిరణ్, అప్పలస్వామి, నాయకులు మురళీకృష్ణ, సీవోలు ఝాన్సీ, నాయుడు, దొర, పద్మావతి, ప్రవీణ్, ఆర్‌పీలు, మహిళలు పాల్గొన్నారు.

గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న విశాఖ పశ్చిమ సయన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గోపాలపట్నం: పేదల గుండెకు ఆడారి తులసీరావు ట్రస్ట్(ఏటీఆర్) అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో శనివారం ఏటీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని శిబిరం జరుగుతున్న తీరును పరిశీలించారు. ఆరోగ్యం విషయంలో అందరూ చాలా జాగ్రత్త వహించాలని సూచించారు. నియోజకవర్గంలో వారంలో మూడు రోజులు పలు ప్రాంతాల్లో గుండె, నేత్ర వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు గుండె వైద్యశిబిరం ద్వారా నలుగురికి యాంజియోగ్రామ్ చేయగా ఇద్దరికి ఆపరేషన్లు చేశామని పేర్కొన్నారు. శిబిరంలో ఉచితంగా బీపీ, సుగర్, ఈసీజీ, 2డి ఎకో పరీక్షలు చేశారు. గుండె వైద్య నిపుణుడు దవళ వాసు బాబు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. 90వ వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి పర్యవేక్షణలో శిబిరం జరిగింది. కార్యక్రమంలో నాయకులు నమ్మి శ్రీను, యల్లపు వెంకటేశ్వరరావు, దొడ్డి సతీష్, శంషాద్ బేగం, సత్యవతి, సచివాలయ కన్వీనర్లు, ఆర్‌పీలు వలంటీర్లు పాల్గొన్నారు.

సీతారాముల ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



సీతారాములు ఆలయ హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో వెలసిన సీతారాముల ఆలయ హుండీ ఆదాయాన్ని వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. భక్తులు ఆలయ హుండీలో సమర్పించిన నగదు 37,500 రూపాయిలు వచ్చిందన్నారు. కార్పొరేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 30న శ్రీ రామ నవమిని పర్వదినం పురస్కరించుకుని సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 28న ఉదయం 9 గంటలకు సీతారామ కల్యాణరాట, 30న ఉదయం 5 గంటల నుంచి శ్రీ రామనవమిని పురస్కరించుకుని సీతారాములకు పంచామృతాభిషేకాలు, అనంతరం 10 గంటలకు సీతారాములు కల్యాణం ఘనంగా నిర్వహిస్తామన్నారు. అదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్నసమారాధన, సాయంత్రం 5 గంటలకు శ్రీ సీతారాముల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌ఆర్‌కు ఆస్కార్.. గొప్ప విజయం

- ప్రముఖ సంగీత దర్శకుడు తమన్

సింహాచలం: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాకు ఆస్కార్ అవార్డు రావడంతో తెలుగు సినిమా స్థాయి ఉన్నత శిఖరాలకు వెళ్లిందని ప్రముఖ సినీ సంగీత దర్శకుడు తమన్ అన్నారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా తమన్ మాట్లాడుతూ ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో పాటకు ఆస్కార్ రావడం తెలుగు సినీ పరిశ్రమకు గొప్ప విజయం అని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రామ్ హీరోగా.. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాకు సంగీత దర్శకత్వం వహిస్తున్నట్లు చెప్పారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, సంపంగి శ్రీనివాసరావు తమన్ వెంట ఉన్నారు.



పూజలు నిర్వహిస్తున్న సంగీత దర్శకుడు తమన్

జాబ్‌మేళాకు విశేష స్పందన



అభ్యర్థులతో మాట్లాడుతున్న అధికారి సుబ్బిరెడ్డి

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం మోడల్ కెరీర్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు(క్లరికల్/టెక్నికల్) కె.సుధ, సీహెచ్ సుబ్బిరెడ్డి తెలిపారు. సుమారు ఏడు కంపెనీల్లో 345 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ట్రైనీ, పెయింటర్స్, టెక్నీషియన్, సేల్స్, కన్సల్టెంట్స్, టెలీ కాలర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, డెంటర్, క్యాషియర్, ఉద్యోగాల కోసం సుమారు 348 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 98 మంది అభ్యర్థులు ఆయా కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు సుబ్బిరెడ్డి తెలిపారు. వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఉపాధి అధికారి సి.ఉమాదేవి, సీహెచ్ కుమార స్వామి, ప్రతినిధులు కృష్ణచైతన్య, లత, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సంపత్ వేంకటేశ్వరుడికి విశేష పూజలు

కంచరపాలెం: గొల్ల కంచరపాలెంలోని సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. ప్రధాన అర్చకుడు రేజేటి రామాచార్యులు ఆధ్వర్యంలో పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామికి సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం స్వామివారిని పల్లకీలో ఊరేగించారు.

కలియుగ వెంకన్నకు సుప్రభాత సేవ

తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.